సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 3 । జూన్ । 2025

గరిష్టం/కనిష్టం
39.3 /22.7

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటినుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

బాన్సువాడ రూరల్: డిగ్రీ ఫస్టియర్ సెకండ్ సెమిస్టర్ పరీక్షలను బుధవారంనుంచి నిర్వహించనున్నట్లు బాన్సువాడలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 నుంచి మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రాక్టికల్స్ సెంటర్ పరిశీలన



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ ప్రాక్టికల్స్ సెంటర్‌ను సోమవారం ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుంచి 6వ తేదీ వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు.

నేడు యోగా వాక్

కామారెడ్డి అర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం యోగా వాక్ నిర్వహించనున్నట్లు ఆయుష్ డీపీఎం ఆకుల శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద యోగా నడక ప్రారంభమవుతుందని, స్టేషన్ రోడ్డు మీదుగా రైల్వే స్టేషన్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు యోగా వాక్‌లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డీఎస్పీ ఆఫీస్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి డీఎస్పీ ఆఫీస్‌ను మార్చారు. ఇన్నాళ్లు డీఎస్పీ కార్యాలయం ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగుతూ వచ్చింది. నూతన కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాస్ రావు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలి



కామారెడ్డి టౌన్: పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టిన వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలో ప్రారంభోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కోసం 100 రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ ఈఈ వేణుగోపాల్, ఏఈ శంకర్, ఆర్వో రవిగోపాల్, టీపీవో గిరిధర్, సానిటరీ ఎస్సైలు నగేష్, పర్వేజ్, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లుట్లపేటలో ఘనంగా రాజరాజేశ్వర విగ్రహ ప్రతిష్ఠ



ఎల్లారెడ్డిరూరల్: వెల్లుట్లపేట గ్రామ శివారులోని చెనింగ రాజరాజేశ్వరాలయంలో శివుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా ఉత్సవాలు సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా గణపతి, శివుడు, పార్వతిమాత, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహాలు, నంది, నాగరాజుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి పాల్గొన్నారు. భక్తులు సన్మార్గంలో నడవాలని సూచించారు.

అగ్రస్థానమే లక్ష్యం

తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ముందుకు వెళ్తున్నాం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నాం
- టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టం తెచ్చాం. పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో లింగంపేట మండలాన్ని ఎంపిక చేశాం. 23 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాం. 4,225 దరఖాస్తులు రాగా వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తున్నాం.

మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/కామారెడ్డి క్రైం : అన్ని రంగాలలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్(టీజీటీడీసీ) చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హౌజింగ్‌బోర్డు వద్ద ఉన్న తెలంగాణ అమర వీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పటేల్ రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ఆర్థిక, సామాజిక, పరిపాలన రంగాల్లో ఆదర్శవంతమైన లక్ష్యాలతో ముందుకు సాగుతున్నామన్నారు. కామారెడ్డిని నేరరహిత జిల్లాగా మార్చడానికి పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. జిల్లాలో అమలు చేస్తున్న పథకాలను ఆయన తన ప్రసంగంలో ఏకరువు పెట్టారు. ఆ వివరాలు..



నృత్యం చేస్తున్న కామారెడ్డి కళాక్షేత్రం నృత్య అకాడమీ బాలికలు

- యాసంగిలో 3.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనగోలు చేసి రూ.800.71 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశాం. మహిళలకు ఎక్కువ కేంద్రాలను కేటాయించడం ద్వారా వారు రూ.3.20 కోట్లు లబ్ధిపొందారు. 27,795 మంది రైతుల నుంచి 1.79 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం వడ్లను కొనుగోలు చేశాం. వాటికి రూ.83 కోట్లను బోనస్‌గా చెల్లిస్తాం. యాసంగి సీజన్‌లో 2.70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.216 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశాం. 24 జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 30,202 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేశాం. రైతులకు రూ.102 కోట్లు చెల్లించాం. 653 మెట్రిక్ టన్నుల పొద్దు తిరుగుడు విత్తనాలను కొనుగోలు చేసి రూ.5 కోట్లను రైతులకు చెల్లించాం. ఖరీఫ్ సీజన్‌లో 5,067 మంది రైతుల నుంచి లక్ష క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రూ.74 కోట్లు చెల్లించాం.



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న రమేశ్‌రెడ్డి, సంగ్వాన్

- జిల్లాలో ఇందిర మహిళా శక్తి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రూ.169.29 కోట్లతో 12,905 యూనిట్లు, పట్టణ ప్రాంతాల్లో రూ.5.76 కోట్లతో 149 యూనిట్లను మంజూరు చేశాం. వాటి ద్వారా మహిళలు ఉపాధి పొందుతున్నారు.
- రైతులకు వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున నాలుగు రైతు వేదికలలో దృశ్య శ్రవణ సౌకర్యాన్ని కల్పించి 53 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాం.
- జిల్లాలో అకాల వర్షాలతో 493 మంది రైతులకు సంబంధించిన 480 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.48 లక్షలు బాధిత రైతుల ఖాతాల్లో జమ చేశాం.
- 1,01,535 మంది రైతులకు సంబంధించి రూ.733.22 కోట్ల పంట రుణాలను మాఫీ చేశాం.
- జిల్లాలో 1,072 మంది రైతులు చనిపోగా 693 మంది రైతుల నామినీల ఖాతాల్లో రూ.34.65 కోట్లు జమ చేశాం.
- 11,153 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 2,894 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 144 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి కావడంతో లబ్ధిదారులకు రూ.1.09 కోట్లు చెల్లించాం.
- అమృత్-2 పథకంలో భాగంగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో రూ.180 కోట్లతో చేపట్టిన నీటి సరఫరా పనులు పురోగతిలో ఉన్నాయి.
- జిల్లాలో 2,56,732 రేషన్‌కార్డులకు ఏప్రిల్‌లో 5,571 మెట్రిక్ టన్నులు, మేలో 5,787 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీ చేశాం. జూన్, జూలై, ఆగస్టు మాసాలకుగాను 17,711 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేస్తాం.
- రూ.500 లకు గ్యాస్ సిలిండర్ పథకం కింద జిల్లాలో 1,50,131 మందికి 5,58,981 సిలిండర్లను పంపిణీ చేశాం. దీనికి రూ.16.05 కోట్లు ఖర్చు చేశాం.
- ఆర్టీసీలో కల్పించిన ఉచిత ప్రయాణం ద్వారా మహిళలకు రూ. 137 కోట్ల మేర ప్రయోజనం కలిగింది.
- జిల్లాలో 3,889 మందికి రేషన్‌కార్డులు మంజూరయ్యాయి. అలాగే రేషన్ కార్డులలో 45,344 మంది కుటుంబ సభ్యుల పేర్లు యాడ్ అయ్యాయి.
- చేయూత పథకం ద్వారా జిల్లాలో 1.62 లక్షల మందికి ప్రతినెలా రూ.36.22 కోట్లు అందిస్తున్నాం.
- గృహజ్యోతి పథకం ద్వారా జిల్లాలో 1,57,656 కుటుంబాలకు 2 వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీనికోసం ప్రభుత్వం రూ.5.68 కోట్లు ఖర్చు చేస్తోంది.
- జిల్లాలో ఏడాది కాలంలో 17,611 మంది నిరుపేదలకు శస్త్ర చికిత్సలు, చికిత్సల గురించి రూ.42 కోట్లు ఆరోగ్య శ్రీ ద్వారా ఖర్చు చేశాం.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు..

ఉత్సవాలలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. వారికి జ్ఞాపికలు అందించి అభినందించారు. అభివృద్ధిపై ఆయా శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆహూతులు సందర్శించారు. ఉత్సవాలలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్ చంద్ర, అడిషనల్ కలెక్టర్లు చందర్‌నాయక్, విక్టర్, డీఎఫ్‌వో నిఖిత, ఏఎస్పీ చైతన్యరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి, పక్కన కలెక్టర్ సంగ్వాన్, ఎస్పీ రాజేశ్‌చంద్ర



డ్రోన్ పనితీరును ఆసక్తిగా తిలకిస్తున్న అతిథులు

'నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం'..

కామారెడ్డి క్రైం: 'నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 8 మంది రైతులకు విత్తన కిట్ (విత్తనాల బస్తా)లను అందించారు. విత్తు కొద్దీ పంట అనే నానుడిని నిజం చేస్తూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని డీఏవో తిరుమల ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని 25 మండలాల పరిధిలో ఉన్న ప్రతి రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులను ఎంపిక చేసి వారికి నాణ్యమైన వరి, పెసర విత్తనాలు అందజేస్తామన్నారు. రైతులు ఈ విత్తనాలతో సాగు చేసి, పండిన పంటను ఇతర రైతులకు విత్తనాలుగా అందించడం ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. విత్తన లభ్యతను పెంచడమే కాకుండా నాణ్యమైన విత్తనంపై రైతులకు అవగాహన కల్పించడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి మండలానికి ఒక శాస్త్రవేత్తను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి, శాస్త్రవేత్త ఏనుగు అనిల్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



రైతుకు విత్తనాల బస్తాను అందిస్తున్న రమేశ్‌రెడ్డి

పరిష్కారం లభించేనా?

- నేటి నుంచి రెవెన్యూ సదస్సులు
- అన్ని గ్రామాల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- భూ సమస్యలపై రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు
- కార్యాచరణ సిద్ధం చేసిన యంత్రాంగం

భూ సమస్యలకు పరిష్కారం చూపేందుకు తీసుకువచ్చిన భూభారతి చట్టం అమలుకోసం అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి సర్కారు సిద్ధమయ్యింది. అధికారులు మంగళవారంనుంచి ఈనెల 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో సదస్సులు నిర్వహించి రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు. ఈసారైనా తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందేమోనని బాధిత రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

– కామారెడ్డి క్రైం



ముంబోజీపేటలో క్షేత్రస్థాయిలో భూభారతి సర్వేను పరిశీలిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి(ఫైల్)

భూభారతి అమలుకోసం ప్రభుత్వం రాష్ట్రంలో నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి సదస్సులు నిర్వహించింది. అందులో లింగంపేట మండలం ఒకటి. అధికారులు సదస్సులు నిర్వహించి భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. లింగంపేట మండలంలో మొత్తం 4,225 ఫిర్యాదులు రాగా దాదాపు వెయ్యి సమస్యలను అధికారులు పరిష్కరించారు. మిగతావి పరిశీలనలో ఉన్నాయి. దీని బట్టి చూస్తే చిన్నచిన్న సమస్యలకు వెంటనే పరిష్కారాలు దొరికే అవకాశాలున్నాయి. సర్వేలు, నివేదికలు తయారు చేయాల్సిన వాటి విషయంలో కాస్త ఆలస్యం జరగవచ్చు. హైకోర్టులో కేసు నడుస్తోంది కాబట్టి సాదాబైనామాలను ఇప్పట్లో పరిష్కరించే అవకాశం లేదు. వాటితో పాటు కోర్టులో ఉన్న కేసులు మినహా మిగతా భూసమస్యలకు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నారు.

పైలట్ ప్రాజెక్టు అనుభవంతో..

లింగంపేట మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో సదస్సులు నిర్వహించి రైతులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ క్రమంలో సదస్సుల నిర్వహణలో జిల్లా యంత్రాగానికి మంచి అనుభవం వచ్చింది. రైతుల నుంచి ఎక్కువగా ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయి, సమస్యల పరిష్కారాలకు తీసుకోవాల్సిన చర్యలు ఏ విధంగా ఉండాలి తదితర అంశాలపై జిల్లా అధికారులు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చారు. లింగంపేట మండలంలో ఎదురైన అనుభవాలతో జిల్లాలోని మిగతా మండలాల అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు సైతం నిర్వహించారు.

బృందాల ఏర్పాటు..

జిల్లాలో లింగంపేట మినహా మిగిలిన అన్ని మండలాల్లో బుధవారం నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి అక్కడి పరిస్థితులు, అవసరాలను బట్టి అధికారులను సర్దుబాటు చేస్తూ రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్, ఉప తహసీల్దార్‌లు ఆయా బృందాలకు బాధ్యులుగా ఉంటారు. వారు ప్రణాళిక ప్రకారం కేటాయించిన తేదీల్లో గ్రామాలకు చేరుకుని సదస్సులు నిర్వహిస్తారు. స్థానికంగా ఉండే రైతుల నుంచి భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరిస్తారు. పట్టా పాస్ పుస్తకాలు, రికార్డుల్లో తప్పులు, సర్వే నంబర్‌లు, విస్తీర్ణంలో తప్పులు, అటవీ, రెవెన్యూ భూమి సరిహద్దుల వివాదాలు, వారసత్వ హక్కులు, పట్టా మార్పిడులు, రికార్డుల్లో నమోదు కాని భూములు తదితర అన్ని రకాల సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరిస్తారు. ఆ తర్వాత ఫిర్యాదులపై విచారణకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారు. వీలయినంత త్వరగా, పారదర్శకంగా భూ సమస్యలకు పరిష్కారం చూపడమే ఈ సదస్సుల నిర్వహణ ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఇందుకుగాను ఇప్పటికే ఆయా మండలాల్లో పర్యటించాల్సిన బృందాల ఎంపిక, గ్రామాల వారీగా ప్రణాళిక పూర్తి చేశారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి

అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగనున్నాయి. అందుకోసం అన్ని ఏర్పాట్లు చేశాం. సదస్సులను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రణాళికా బద్ధంగా గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తాం.

– మస్రూర్ అహ్మద్, ఏవో, కామారెడ్డి కలెక్టరేట్

సర్కారు బడిలో పిల్లలు

ఆదర్శంగా నిలిచిన ప్రధానోపాధ్యాయుడు



పిల్లలకు పాఠశాలలో అడ్మిషన్ తీసుకుంటున్న హెచ్‌ఎం ప్రభాకర్

బీబీపేట: తన పిల్లలను సర్కారు బడిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు మాందాపూర్ ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ చింతల ప్రభాకర్. ప్రభాకర్‌కు ఇద్దరు పిల్లలు. సోమవారం ఆయన వారిని తీసుకుని పాఠశాలకు వచ్చారు. కూతురు మృణాళినిని మూడో తరగతిలో, కుమారుడు శివకేశవ్‌ను ఒకటో తరగతిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవం కలిగిన ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. డిజిటల్ తరగతులు అందుబాటులో ఉన్నాయని, నాణ్యమైన విద్య అందుతోందని పేర్కొన్నారు. అందుకే తన పిల్లలను సర్కారు బడిలో చేర్పించానన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ప్రత్యూష్, ఉపాధ్యాయులు శ్యాం, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లంపి స్కిన్ సోకిన ఆవులకు వ్యాక్సినేషన్



సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో సంచరిస్తున్న పశువులకు లంపి స్కిన్ వ్యాధి సోకి ఇతర మూగ జీవాలకు వ్యాప్తి చెందుతున్న ఘటనపై సోమవారం ప్రచురితమైన కథనానికి పశువైద్యశాఖ అధికారులు స్పందించారు. సోమవారం మండల పశువైద్యాధికారి రవికిరణ్ వీక్లీమార్కెట్, శివాలయం వద్ద ఆవులను పరిశీలించారు. లంపి స్కిన్ సోకిన ఆవులను గుర్తించి వాటికి చికిత్సతో పాటు వ్యాక్సిన్ వేశారు. మిగతా ఆవులను పరిశీలించారు. ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



ఎల్లారెడ్డిలో పాఠశాలలకు పుస్తకాలను అందిస్తున్న ఎంఈవో రాజులు

ఎల్లారెడ్డిరూరల్/లింగంపేట/నిజాంసాగర్ : ఎల్లారెడ్డి మండలం ప్రభుత్వ పాఠశాలలకు ఎంఈవో రాజులు సోమవారం పుస్తకాలను అందించారు. పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా మండల కేంద్రానికి పుస్తకాలు రావడంతో వాటిని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయుల ద్వారా అందించారు. . అలాగే లింగంపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఎంఈవో షౌకత్అలీ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. మండలంలోని ఆయా పాఠశాలలకు 21వేల పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు. నిజాంసాగర్ విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవో తిరుపతి రెడ్డి పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. 2025–26 విద్యాసంవత్సరానికి గాను ప్రభుత్వ పరంగా 80 శాతం మేర పాఠ్యపుస్తకాలను సరఫరా చేసిందని ఎంఈవో తిరుపతి రెడ్డి తెలిపారు. విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన పుస్తకాలను పాఠశాలల వారిగా ప్రధానోపాధ్యాయులకు అందజేశామన్నారు. పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు పుస్తకాలను అందించాలని ఉపాధ్యాయులకు ఎంఈవోలు సూచించారు.



నిజాంసాగర్‌లో ..

బస్సు ఆపమన్నందుకు ఒకరిపై దాడి

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో ఆర్టీసీ బస్సును ఆపమన్నందుకు డ్రైవర్ దురుసుగా ప్రవర్తించాడని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. భైంసా నుంచి నిజామాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కేందుకు యంచ మాజీ సర్పంచ్ కొట్టాల లహరి, ఆమె భర్త ప్రవీణ్‌తోపాటు కుటుంబ సభ్యులు బస్టాండ్‌లో ఉన్నారు. బస్సును ఆపకపోవడంతో సర్పంచ్ భర్త ప్రవీణ్ కొద్ది దూరం ముందుకు వెళ్లి బస్సుకు అడ్డుగా నిలబడ్డాడు. దీంతో ఆగ్రహానికి గురైన డ్రైవర్.. ప్రవీణ్‌పై దాడికి పాల్పడి గాయపర్చాడు. దీంతో ప్రవీణ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



జెండా వందనం చేస్తున్న టీజీటీడీసీ చైర్మన్ రమేశ్ రెడ్డి, అధికారులు



మహాలక్ష్మి పథకాన్ని చాటే బస్సు వద్ద అతిథి, అధికారులు

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేసి, అందిస్తున్న సేవలను వివరించారు.

– కామారెడ్డి క్రైం



జ్ఞాపిక అందుకుంటున్న ఇసాయిపేట విద్యార్థులు



వైద్య ఆరోగ్య శాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం



హాజరైన మహిళా అధికారులు



మంజూరు పత్రాలు అందుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు..



గ్యాస్ లీకేజీని ఎలా ఎదుర్కొనాలన్న దానిపై ప్రదర్శన



ఇసాయిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల నృత్యం



నృత్యం చేసిన విద్యార్థినులను అభినందిస్తున్న అతిథులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఇటీవల పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించగా వారిలో ఉత్తమ ప్రతిభతో జిల్లాలో ర్యాంకు సాధించిన విద్యార్థులను సన్మానించారు. పదవ తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఉడేం రాములు 558 మార్కులు, నందకిషోర్ 551 మార్కులు, సాయి చరణ్ 536 మార్కులు సాధించగా వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధలక్ష్మీ, ఉపాధ్యాయులు బాపురెడ్డి, వెంకటరెడ్డి, సుజాతరాణి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచిర్యాంకులు సాధించవచ్చు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఉపాధ్యాయులు చెప్పిన ప్రకారం క్రమశిక్షణతో చదివినట్లయితే మంచిర్యాంకులు సాధించవచ్చని ప్రిన్సిపల్ సురేఖ అన్నారు. తాడ్వాయి బాలికల గురుకుల పాఠశాలలో చదివి ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థిని లక్క పాటి లాస్యను సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రవంతి, దివ్యవాణి, లాస్య తల్లి లక్కపాటి విజయ, మానవహక్కుల సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి సోమనాథ్, గంగామురళి, జశ్వంత్, సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచ విద్యార్థులకు ప్రశంసలు



మాచారెడ్డి : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ పాల్వంచ విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనతోపాటు సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులను ప్రశంసించి జ్ఞాపికను అందించారని హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీ



ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, కారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సు, కారును ఢీకొట్టింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు (నబరు టీజీ 16 టీ 2156) డిచ్‌పల్లి బస్టాండ్‌లో నుంచి ప్రధాన రోడ్డు పైకి వస్తోంది. అదే సమయంలో నాగ్‌పూర్ గేట్ వైపు నుంచి నిజామాబాద్ వెళుతున్న కారు (నంబర్ టీఎస్ 18 హెచ్ 6831)ను వెనక నుంచి బస్సు ఢీకొట్టింది. కారు ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా తిరగడంతో కారు, బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళన చెందారు. అదృష్టవశాత్తు కారులోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. రోడ్డుకు అడ్డుగా రెండు వాహనాలు నిలిచిపోయేసరికి కొద్ది సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న కారు, ఆర్టీసీ బస్సును పక్కకు తొలగించి వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.

సమగ్ర వ్యాధి నిర్ధారణ అంబులెన్స్ ప్రారంభం

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా వైద్యారోగ్యశాఖలోని ఎయిడ్స్ కంట్రోల్ యూనిట్ ఆధ్వర్యంలో ఉచిత సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల వాహనాన్ని(అంబులెన్స్) కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయి చైతన్యలతో కలిసి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ ప్రారంభించారు. బీపీ, షుగర్‌తోపాటు టీబీ, హైపటైటిస్– బీ, సీ, హెచ్ఐవీ తదితర వ్యాధుల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



నందిని (ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన బొంత నందిని(16) కుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని మత్తడికింది పల్లెకు చెందిన నందిని తరచూ ఫోన్ చూస్తోందని తల్లిదండ్రులు శెణవ్వ, పోచయ్య మందలించారు. దీంతో మనస్తాపం చెందిన నందిని ఆదివారం రాత్రి అందరూ పడుకున్న తర్వాత ఇంటి తలుపులకు గొళ్లెం పెట్టి వెళ్లిపోయింది. సోమవారం ఉదయం తల్లిదండ్రులు లేచి చూడగా బయట నుంచి తలుపులకు గొళ్లెం పెట్టి ఉంది. నందిని కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మధ్యాహ్నం లింగంపేటలోని చీరపేండ్ల కుంటలో నందిని మృతదేహం లభించింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి మందలించాడని..

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని సీతాయిపల్లి గ్రామానికి చెందిన మొగుళ్ల అనిల్ కుమార్(24) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అనిల్‌కుమార్ మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా జులాయిగా తిరిగేవాడు. ఏదైనా పని చేయాలని తండ్రి సాయిలు ఆదివారం మందలించడంతో రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా సోమవారం మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొర్పోల్ గ్రామానికి చెందిన చిన్న సాయిలు(55) గుర్తుతెలియని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. చిన్న సాయిలు గత నెల 25వ తేదీన ఇంటి నుంచి వెళ్లి, తిరిగి 31వ తేదీన గ్రామానికి వచ్చాడు. ఇంటికి వెళ్లకుండా పంట చేనులోనే ఉండడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చేనుకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు హైదరాబాద్‌కు రిఫర్ చేయగా కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

ఎల్లారెడ్డి: మండలంలోని శివానగర్‌లో పేకాడుతున్న నలుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం శివానగర్‌లో దాడులు నిర్వహించి పేకాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.5,400 నగదు, మూడు వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు సీజ్ చేశామన్నారు.

బైక్, ఆటో ఢీ..ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డి: బైక్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎల్లారెడ్డికి చెందిన ఖలీల్ ఎల్లారెడ్డి నుంచి దేవునిపల్లికి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ఖలీల్ కాలు విరగడంతో కామారెడ్డికి రిఫర్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన వాహనం

ఎల్లారెడ్డి రూరల్: మండలంలోని మల్లయ్యపల్లి గ్రామ శివారులో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఆదివారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న గూడ్స్ ఆటోను తనిఖీ చేశామన్నారు. 13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించడంతో వాహనాన్ని ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని అక్కంపల్లిలో సోమవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత పడింది. గ్రామంలోని మండ గోపాల్‌కు చెందిన గేదె మేత కోసం వెళ్లి.. ప్రమాదవశాత్తు గ్రామ పంచాయతీ బోరు మోటారుకు అమర్చిన విద్యుత్ వైరుకు తగిలి అక్కడికక్కడే మరణించింది. గేదె విలువ సుమారు రూ.50వేలకు పైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

మున్సిపాలిటీ.. జీపీ.. మున్సిపాలిటీగా..

మీకు తెలుసా?



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం

ఏ గ్రామమైనా పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారుతుంది. కానీ ఆర్మూర్ మాత్రం మొదట మున్సిపాలిటీగా, తర్వాత గ్రామ పంచాయతీగా, మళ్లీ మున్సిపాలిటీగా మారిందని ఎంత మందికి తెలుసు..

- 1956 నుంచి 1962 వరకు మున్సిపాలిటీగా ఉన్న ఆర్మూర్‌కు మొదటి చైర్మన్‌గా కేవీ నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు.
- పరిపాలనా సౌలభ్యం కోసం 1962లో మున్సిపాలిటీని గ్రామ పంచాయతీగా మార్చారు.
- 44 ఏళ్ల పాటు జీపీగా ఉన్న ఆర్మూర్‌ను 2006లో 23 వార్డులతో మున్సిపాలిటీగా అభివృద్ధి చేశారు.
- కోర్టు కేసుల అనంతరం 2008 జూన్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు.
- 2014, 2019లో మున్సిపల్ ఎన్నికలు చేపట్టారు.
- 2019 ఎన్నికల్లో భౌగోళికంగా ఆర్మూర్ పట్టణానికి చుట్టూ మూడు కిలో మీటర్ల పరిధిలో ఉన్న పెర్కిట్, కొటార్మూర్(హామ్లెట్ గ్రామం), మామిడిపల్లి జీపీలను మున్సిపల్‌లో విలీనం చేశారు.
- 36 వార్డులుగా విభజించి రిజర్వేషన్లు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. దీంతో ఆర్మూర్ పట్టణ పరిధి మరింత పెరిగింది.

–ఆర్మూర్

మీసేవ సర్టిఫికెట్లు పొందండి ఇలా..



డొంకేశ్వర్(ఆర్మూర్): విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ప్రవేశాలు, దరఖాస్తుల కోసం విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాలు తప్పనిసరి. వీటి కోసం మీసేవ కేంద్రాల్లో ఏవిధంగా దరఖాస్తు చేయాలి? ఏయే పత్రాలు దరఖాస్తుకు జత చేయాలి? అనే వివరాలు మీ కోసం..

కులం (క్యాస్ట్) సర్టిఫికెట్

- ఆధార్‌తోపాటు టెన్త్ మెమో లేదా బోనాఫైడ్/ పుట్టిన తేదీ సర్టిఫికెట్ జత చేయాలి.
- దరఖాస్తుదారునిది పాత కులం సర్టిఫికెట్ లేదా కుటుంబసభ్యుల్లో ఎవరిదైనా ఒకరిది.

ఆదాయం (ఇన్‌కమ్) సర్టిఫికెట్

- ఆధార్ కార్డు /ఓటరు కార్డు, రేషన్ కార్డు
- ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో

నివాస సర్టిఫికెట్

- ఆధార్‌కార్డు /ఓటరు కార్డు / ఇంటిపన్ను రసీదు/ కరెంట్ బిల్లు
- ఒక పాస్ పోర్టు సైజు ఫొటో

పై ధ్రువపత్రాలకు సంబంధించిన దరఖాస్తు ఫారాలు మీసేవ కేంద్రాల్లోనే లభిస్తాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తయిన తర్వాత ఆ ఫారాన్ని స్థానిక తహసీల్ కార్యాలయంలో అందజేయాలి. అధికారులు పరిశీలించి నిర్ణీత గడువులోపు ఆమోదిస్తారు. అనంతరం మీ సేవ కేంద్రంలోనే సర్టిఫికెట్ ప్రింట్ తీసుకోవాలి.

రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ



బాన్సువాడలో ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: ప్రతి రైతుకు నాణ్యమైన విత్తనాల పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, వ్యవసాయ అధికారులతో కలిసి పలువురు రైతులకు ఉచితంగా ఫౌండేషన్ సీడ్ పంపిణీ చేశారు. వర్షాకాలం సాగు కోసం వ్యవసాయశాఖ, రుద్రూర్‌లోని యూనివర్శిటీలు సంయుక్తంగా విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నాయన్నారు. మండలానికి 10కేజీల 38 ప్యాకెట్ల వరివిత్తనాలు, 19 ప్యాకెట్లు మొక్కజొన్న విత్తనాలను ఆయా గ్రామాలకు చెందిన ఆదర్శరైతులకు అందజేశారు. విత్తనాల ద్వారా ఉత్పత్తి అయిన పంటను కొనుగోలు చేసి గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమాన్ని బలోపేతం చేయనున్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ అరుణ, ఎంఏవో ఫయాజుల్లా తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన

మండలంలోని నాగారం, చిన్న రాంపూర్ గ్రామాల్లో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, స్టేట్ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి పర్యటించారు. నాగారం గ్రామంలో రూ.5లక్షల ప్రభుత్వ నిధులతో నిర్మించిన శ్రీకృష్ణ యాదవ సంఘం ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం చిన్న రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ బీరప్ప అక్క మహంకాళి మందిరంలో నిర్వహించిన కల్యాణమహోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, నర్సుగొండ, మొగులయ్య,రాచప్ప,పరిగె మోహన్‌రెడ్డి,పర్వుగొండ, కుర్మ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలు సంపద సృష్టి కేంద్రాలుగా ఎదగాలి

- తెయూ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరి రావు



జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం తెలంగాణ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరితో కలిసి పరిపాలనా భవనం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో యూనివర్సిటీలు గ్రోత్ ఇంజిన్లుగా పనిచేస్తూ సంపద సృష్టి కేంద్రాలుగా ఎదగాలని సూచించారు. నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన ఎజెండాగా ఏర్పడిన రాష్ట్రం నేడు అభివృద్ధి చెందుతూ దేశానికే రోల్‌మోడల్‌గా ఉండటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, కంట్రోలర్ కే సంపత్ కుమార్, అడ్మిషన్స్ డైరెక్టర్ వాసం చంద్రశేఖర్, అధ్యాపకులు సీహెచ్ ఆంజనేయులు, కే రవీందర్‌రెడ్డి, లక్ష్మణచక్రవర్తి, సంపత్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయాగౌడ్, ఏఈ వినోద్, కాంట్రాక్టు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్యమస్తు..



మైనార్టీ ఐటీఐ ప్రాంగణంలో నిర్మాణం పూర్తికావొస్తున్న ఏటీసీ భవనం

- బోధన్‌లో పూర్తి కావొస్తున్న ఏటీసీ
- త్వరలోనే కొత్త కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్

బోధన్: యువత, విద్యార్థులకు స్కిల్ కోర్సులు అందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు బోధన్ పట్టణ శివారులోని మైనార్టీ ఐటీఐ ప్రాంగణంలో ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) సిద్ధమవుతోంది. మరో వారంలో కేంద్రానికి వచ్చిన ఆధునిక సాంకేతిక పరికరాల బిగింపు ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది విద్యా సంవత్సరానికి స్థానిక మైనార్టీ ఐటీఐలో ఉన్న ట్రేడ్ కోర్సులతోపాటు ఏటీసీలో అత్యాధునిక కొత్త కోర్సుల్లో ప్రవేశానికి త్వరలోనే నోటిఫికేషన్ జారీ కానుంది. పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హత ఉంటుంది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సౌజన్యంతో అత్యాధునిక పరికరాలు, యంత్రాలతో తరగతుల నిర్వహణ, ప్రయోగాత్మక బోధనకు వీలుగా తీర్చిదిద్దనున్నారు. దీంతో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవంతో నైపుణ్యాలను మెరుగుపర్చనున్నారు.

ఆరు కొత్త కోర్సులు ..172 సీట్లు

ఏటీసీకి ఆరు అత్యాధునిక సాంకేతిక కోర్సులు మంజూరయ్యాయి. ఏడాది వ్యవధి కోర్సులైన మ్యాను ఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్‌లో 40 సీట్లు, ఇండస్ట్రియల్ రొబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్‌లో 40, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్ (సెక్టార్ క్యాపిటల్ గూడ్స్ మ్యానుఫ్యాక్చరింగ్)లో 20 సీట్లు ఉన్నాయి. రెండేళ్ల వ్యవధి కోర్సులైన బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్ మెకానికల్‌లో 24 సీట్లు, అడ్వాన్స్‌డ్ సీఎన్సీ మ్యాచినింగ్ టెక్నీషియన్‌లో 24, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్ కోర్సులో 24 సీట్లు ఉన్నాయి.

ఆసక్తి గల విద్యార్థులు ప్రవేశ దరఖాస్తుకు ఎస్ఎస్‌సీ మెమో, కుల ధృవీకరణ పత్రం, టీసీ, బోనాఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు జత చేయాల్సి ఉంటుంది. త్వరలోనే నోటిఫికేషన్ వస్తుందని, అనంతరం అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ శాంతారాం తెలిపారు. మిగతా వివరాలకు 94925 80776, 90592 10915 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.